క్లుప్తంగా

2 నుంచి ఆడుదాం ఆంధ్ర

మలికిపురం: అక్టోబర్ 2వ తేదీ నుంచి ఎనిమిది రోజుల పాటు ఆడుదాం ఆంధ్ర అనే కార్యక్రమం కింద ఆటల పోటీలు సచివాలయ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు వద్ద జరుగుతాయని మలికిపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ముత్యం వీరాస్వామినాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనల విడుదల చేశారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖో–ఖో, బ్యాడ్మింటన్ ఆటలకు సంబంధించి పోటీలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ పోటీలలో పాల్గొనడానికి 17 ఏళ్లు పైబడినవారు అర్హులని పేర్కొన్నారు. ఉత్సాహవంతులు పంచాయతీ సెక్రటరీల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నిత్యాన్నదానానికి విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదానానికి మంగళవారం భీమవరం మండలానికి చెందిన దాత బీ.భీమేశ్వరరావు, ఫణిత రత్న మౌనిక దంపతులు రూ.25,116 విరాళం అందజేశారు. ఈ మేరకు ఆలయ సూపరింటెండెంట్ పీ.విజయసారథికి పై మొత్తాన్ని ఇచ్చి స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని వారు అందుకున్నారు.

నేత్రదానం


అనురాధ (ఫైల్)

ఆత్రేయపురం: మండల పరిధిలోని పేరవరం గ్రామానికి చెందిన రావిపాటి అనురాధ (47) మంగళవారం ఉదయం మృతి చెందారు. ఆమె నేత్రాలను రాజమహేంద్రవరం రాధాకృష్ణ ఐ బ్యాంక్ స్వీకరించింది. ఆమెకు భర్త వీర్రాజు, ఒక అబ్బాయి, అమ్మాయి ఉన్నారు.

కబడ్డీ పోటీల్లో విజేతగా పాశర్లపూడిలంక జట్లు

మామిడికుదురు: మండల స్థాయి స్కూల్ గేమ్స్‌లో భాగంగా మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన అండర్–14 కబడ్డీ పోటీల్లో విజేతగా పాశర్లపూడిలంక శ్రీబొరుసు తిరుపత్య మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్టు నిలిచింది. ప్రతిభ చూపిన విద్యార్థులను సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, గ్రామస్తులు మంగళవారం అభినందించారు.

నిత్యావసర సరకులు, కూరగాయల పంపిణీ

కొత్తపేట: సినీ దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల పుట్టినరోజు పురస్కరించుకుని మంగళవారం మండల పరిధిలోని వాడపాలెంలో అభిమాన సంఘం అధ్యక్షుడు చింతపల్లి పళ్లంరాజు ఆధ్వర్యంలో 50 మంది పేదలు, వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులకు నిత్యావసర సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు.

టీడీపీ నేతల పాదయాత్ర

అయినవిల్లి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును బెయిల్‌పై విడుదల చేయాలని కోరుతూ ముక్తేశ్వరం సెంటర్ నుంచి అయినవిల్లి వినాయక సన్నిధి వరకూ మంగళవారం అంబేడ్కర్ కోనసీమ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి ఆధ్వర్యంలో పార్టీ నేతలు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం వినాయక సన్నిధిలో పూజా కార్యక్రమాలు చేశారు. నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

వినాయక మంటపంలో చోరీ

రాజోలు: సోంపల్లిలో వినాయక మంటపంలో పంచలోహ వినాయకుని ప్రతిమ చోరీకి గురైంది. ఈ మేరకు రాజోలు పోలీసులు మంగళవారం సంఘటనా స్థలన్ని పరిశీలించారు. సోంపల్లి పల్లిపాలెంలో ఏర్పాటు చేసి వినాయకుని పందిరిలో పూజల కోసం ఏర్పాటు చేసి పంచలోహ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. మంటపంలో ఏర్పాటు చేసిన 10 అడుగుల వినాయకుని విగ్రహం ఎడమ చేయి భాగం, తొండం ధ్వంసం చేశారు. కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పృథ్వీ తెలిపారు.

కోలాటంలో ఘర్షణపై కేసు

కొత్తపేట: వినాయకచవితి సందర్భంగా కోలాటంలో ఏర్పడిన ఘర్షణ, ఒక వ్యక్తికి గాయాలపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వి.మణికుమార్ తెలిపారు. మండల పరిధిలోని వాడపాలెం గ్రామంలో వినాయకచవితి సందర్భంగా యువకులు కర్రలతో కోలాటం ఆడుతున్నారు. వారిలో గనిసెట్టి సత్యసాయి కోలాటం ప్రదర్శన చేస్తుండగా అదే గ్రామానికి చెందిన బొల్లాటి వెంకటేశ్వర్లు, అతని సోదరుడు సాయిపవన్ అనే వ్యక్తి కలిసి ఇదేమి కోలాటం అని అపహాస్యం చేశారు. దానితో ఇరువురి మధ్య ఘర్షణ ఏర్పడింది. సత్యసాయిని వెంకటేశ్వర్లు తన చేతిలో ఉన్న కర్రతో కొట్టగా తలకు గాయమైంది. సాయిపవన్ కూడా చేతులతో కొట్టి, కాళ్లతో తన్ని పరారయ్యాడు. బాధితుడిని స్థానికులు కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మణికుమార్ తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

మామిడికుదురు: యానాం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న పెదపట్నం అగ్రహారం గ్రామానికి చెందిన గెద్దాడ ఉమా మహేశ్వరరావును అరెస్టు చేశామని రాజోలు ఎస్ఈబీ ఎస్సై రఘు మంగళవారం తెలిపారు. ఉమా మహేశ్వరరావు వద్ద నుంచి 58 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఈబీ ఎస్సై రఘు తెలిపారు.


మోరి మెయిన్‌లో వినాయక చవితి పూజల్లో నిమగ్నమైన భక్తులు


మామిడికుదురులో పూజలందుకున్న వినాయకుడు


చాకలిపాలెంలో బొమ్మల కొలువులో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం


రాజోలు మేకలపాలెంలో విష్ణుమూర్తి సమేత గణనాథుడు


ఆత్రేయపురం శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గణపతి హోమం నిర్వహిస్తున్న పండితులు

గణనాథులకు ఘనంగా పూజలు

- వాడవాడలా వెలసిన పందిర్లు
- పల్లెల్లో గణపతి నవరాత్రుల సందడి


కొత్తపేట కళానగర్ గణపతిని దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వాడవాడలా గణపతి నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రాలు, ప్రధాన గ్రామాలు, శివారు గ్రామాల్లోని సిద్ధివినాయకస్వామి ఆలయాలతో పాటు ప్రత్యేకంగా గణపతి నవరాత్ర పందిర్లలో గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలతో ఉత్సవాలు చేపట్టారు. కొత్తపేటతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో గణపతి నవరాత్ర యాగదీక్షా మహోత్సవాలు, ప్రత్యేక పూజలు వైభవంగా ప్రారంభించారు. దీనిలో స్థానిక కళానగర్ సిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలో కమిటీ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు పుల్లాపంతుల విజయ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో శైవాగమ పండితుల పర్యవేక్షణలో తొలిరోజు ఆలయ పోషకులు రిటైర్డ్ డీఎస్పీ వానపల్లి సుబ్రహ్మణ్యం, ప్రముఖ వ్యాపారవేత్తలు వానపల్లి శ్రీనివాస్, సాయిరామ్ సోదరుల దంపతులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ స్వామివారికి అభిషేకం, యాగం, విశేష పూజాదికాలు నిర్వహించారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్కెట్ వద్ద సిద్ధివినాయకస్వామివారి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వానపల్లి గణేశ్ సెంటర్ శ్రీబాలగణపతి స్వామివారి ఆలయం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక పొట్టి శ్రీరాములు వీధి, కొప్పిశెట్టివారి వీధి, సంతోష్‌నగర్, గౌతమినగర్ ప్రాంతాలతో పాటు మండల పరిధిలోని వాడపాలెం, వానపల్లి, బిళ్ళకుర్రు, మోడేకుర్రు, అవిడి, కండ్రిగ, పలివెల, గంటి, మందపల్లి గ్రామాల్లో గణపతి ఆలయాలు, నవరాత్ర పందిర్లలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

సఖినేటిపల్లి: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రధాన కూడలిల్లోను, గణపతి, శివాలయ ఆలయాల్లోను సోమవారం వినాయక చవితి మహోత్సవాలు ఘనంగా మొదలైనవి. మోరి మెయిన్‌లో తాత్కాలింగా ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద అర్చకుడు వాడపల్లి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పేరాబత్తుల రామరావు, లక్ష్మణరావు దంపతులు కలశ స్థాపన చేశారు. అనంతరం వారు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

మామిడికుదురు: వినాయక చవితి వేడుకలు సోమవారం వాడవాడలా వైభవంగా నిర్వహించారు. మామిడికుదురు, నగరం, మొగలికుదురు, పాశర్లపూడి, పెదపట్నం, గెద్దాడ, అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడిలంక, లూటుకుర్రు, ఆదుర్రు, మాకనపాలెం, కొమరాడ, ఈదరాడ, మగటపల్లి, గోగన్నమఠం, కరవాక గ్రామాల్లో చవితి వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. పలుచోట్ల ఏకాహాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు, భజన కార్యక్రమాలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వేడుకలకు భక్తులు భారీగా తరలివచ్చి చవితి పందిళ్లలో కొలువు తీరిన విఘ్నాధిపతులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పి.గన్నవరం: గణపతి నవరాత్ర మహోత్సవాల సందర్భంగా చాకలిపాలెం గ్రామంలో ఆర్‌పీ రోడ్డు పక్కన బొమ్మల కొలువుతో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. న్యాయవాది మెల్లేటి శ్రీనివాసరావు కుటుంబం ఆధ్వర్యంలో బొమ్మల కొలువులో చెట్టు కొమ్మకు కట్టిన ఉయ్యాలలో వినాయకుని విగ్రహాన్ని ఉంచి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికులు స్వామి విగ్రహాన్ని తిలకించి పూజలు చేస్తున్నారు. ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటున్నారు.

రాజోలు: స్థానిక నాగార్జున స్ట్రీట్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని పందిరిలో సరస్వతీ పూజలు నిర్వహించారు. రాజోలు మేకలపాలెంలో ఏర్పాటు చేసిన 12 అడుగుల విష్ణుమూర్తి సమేత గణనాథుడి విగ్రహం ఎంతగానో ఆకట్టుకుంది. కోళ్ల వారి వీధిలో ఏర్పాటు చేసిన 10 అడుగుల గణనాథుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. రాజోలు ఆకుల వారి వీధిలో ఎస్ఆర్‌పి యూత్ ఆధ్వర్యంలో భారీ విగ్రహాన్ని పలువురు దర్శించుకున్నారు. రాజోలు ఆర్టీసీ డిపో ఎదురుగా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

ఆత్రేయపురం: మండల పరిధిలోని 17 గ్రామాల్లో చవితి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆత్రేయపురం శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వేంచేసియున్న వినాయకుని ఆలయం వద్ద గణపతి పూజ, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఆత్రేయపురం, ర్యాలి, వాడపల్లి, పేరవరం, లొల్ల తదితర గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు జరిగాయి.

రావులపాలెం: ఊబలంక శివాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మంటపం, రావులపాలెం శెట్టిబలిజ నగర్‌లో సిద్ధివినాయక యువజన సంఘం, దక్షిణ వీధి రామాలయం, మార్కెట్ రోడ్డు, చిన్న కారు స్టాండ్ తదితర కూడళ్లలో గణనాథుని మంటపాలు ఆయా కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

ఆలమూరు: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలమూరు, చెముడులంక గ్రామాల్లో మట్టితో తయారు చేసిన భారీ వినాయక విగ్రహాలు ఆకర్షించాయి.

116 అరటి గెలలతో...


అంబాజీపేటలో 116 అరటి గెలలతో అలంకరించిన గణపతి ఆలయం

అంబాజీపేట: అంబాజీపేట శివారు గంగలకుర్రు మలుపులో వేంచేసియున్న శ్రీ విజయ గణపతి ఆలయాన్ని 116 అరటి గెలలతో సర్వాంగ సుందరంగా అలకరించారు. వినాయక చవితిని పురస్కరించుకొని స్థానిక ఆలయ కమిటీ ఆధ్వర్యంలో యువకులు కర్పూర, చక్కెరకేళి, అమృతపాణి, పచ్చఅరటి చెట్ల గెలలతో గణపతి ఆలయాన్ని అలంకరించారు. వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న గణపతి ఆలయంలో స్వామి వారిని పసుపుతో అలంకరించారు.

పనికిమాలిన విమర్శలు మానుకోండి

ప్రతిపక్షాలకు ఎమ్మెల్యే రాపాక హితవు

మలికిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రతిపక్షాలు చేస్తున్న పనికిమాలిన విమర్శలు ఇకనైనా మానుకోవాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రూ.4.50 కోట్లతో చేపట్టిన మంజూరయిన కరవాక– చింతలమోరి ప్రధాన రహదారి అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కేశనపల్లి గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమం అనంతరం జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతిపక్షాల తీరుపై నిప్పులు చెరిగారు. రోడ్లు బాగా లేవని కొందరు టీడీపీ నాయకులు సీఎం జగన్‌కు శాపనార్థాలు పెడతారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు టీడీపీ హయాంలో వేసిన రోడ్లు ఇప్పుడు ఎలా ఉన్నాయో ఒకసారి చూడాలని సూచించారు. పదేళ్ళుగా అధ్వానంగా ఉన్న కేశనపల్లి కరవాక, చింతలమోరి రోడ్డును గత టీడీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి రూ.32 కోట్లు మంజూరు అయ్యాయని చెప్పారు. డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల వీర బ్రహ్మాజీరావు అధ్యక్షతన జరిగిన సభలో ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, ఎంపీపీలు మేడిచర్ల వెంకట సత్యావాణి, వీరా మల్లిబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు బల్ల ప్రసన్నకుమారి, పార్టీ జిల్లా గ్రీవెన్స్ సెల్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్య కుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకర బాబ్జి, సర్పంచ్‌లు యెనుముల నాగు, గుర్లింక సత్తిబాబు, సొసైటీ చైర్మన్ యెనుముల నారాయణస్వామి, ఎంపీటీసీ సభ్యుడు రాపాక సత్యనారాయణ పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ

ఆలమూరు: నవ జాత శిశువు, చిన్నారులు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్లజగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరు శివారు కొత్తూరు సెంటర్ వద్ద ఎస్‌జెఆర్ కల్యాణ మంటపంలో మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన నియోజక వర్గ స్థాయి పౌష్టికాహార వారోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాణ్యతతో కూడిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లును ప్రతినెలా అందజేస్తున్నారన్నారు. ఆరు నెలల చిన్నారులకు అన్న ప్రాశన నిర్వహించారు. పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలించి అంగన్‌వాడీలను అభినందించారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు తోరాటి సీతా మహాలక్ష్మి, సర్పంచ్ నేలపూడి లావణ్య, ఉప సర్పంచ్ చల్లా సీతామహాలక్ష్మి, వైస్ ఎంపీపీ ఎస్.రత్నకుమారి, సొసైటీ అధ్యక్షులు నెక్కంటి బుజ్జి , ఏజీపీ నామాల శ్రీనివాస్, సీడీపీఓ శారద పాల్గొన్నారు.

చీరలు, దుప్పట్ల పంపిణీ


చీర, పండ్లను పంపిణీ చేస్తున్న వికాస్‌బాబు, పార్టీ నాయకులు

అంబాజీపేట: ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తనయుడు వికాస్‌బాబు పుట్టినరోజును పురస్కరించుకుని నిరుపేదలకు చీరలు, దుప్పట్లను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వాసంశెట్టి చినబాబు, నాగవరపు నాగరాజుల ఆధ్వర్యంలో అంబాజీపేట బస్టాండ్ ఎదురుగా సోమవారం సుమారు 100 మంది నిరుపేదలకు ఈ పంపిణీ చేశారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు పాల్గొన్నారు.

పి.గన్నవరం: వికాస్‌బాబు పుట్టినరోజు సందర్భంగా స్థానిక అక్విడెక్టు పార్కులో 150 మంది పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు.

సంక్షేమాంధ్రప్రదేశ్ దిశగా అడుగులు

- ఎమ్మెల్యే రాపాక
- తాటిపాకలో గడప గడపకూ మన ప్రభుత్వం


తాటిపాకలో గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమాంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేస్తున్నామని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం తాటిపాకలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే రాపాక వివరించారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి విరాజిల్లుతోందన్నారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఎంతో నిష్పక్షపాతంగా జరుగుతోందన్నారు. ప్రాంతం, కులం, మతం, పార్టీ అనే విభేధాలు లేకుండా అర్హత ఒక్కటే ప్రామాణికంగా తీసుకుంటున్నారన్నారు. దీనికోసం పాలనా వ్యవస్థను గ్రామస్థాయిలోకి తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ, సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి ఏస్తేరురాణి, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, గుబ్బల మనోహర్, మెడబల రాజ్‌కుమార్, మద్దుల కాసు, బొంతు రమేష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- కొత్తపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం


కొత్తపేటలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న జగ్గిరెడ్డి

కొత్తపేట: రాష్ట్రంలో ప్రతీ పేద, మధ్యతరగతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక 4వ సచివాలయం పరిధిలో మంగళవారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు వర్తించిన పథకాలను జగ్గిరెడ్డి వారికి వివరిస్తూ బుక్‌లెట్‌ను అందచేశారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు ఆర్థిక అవసరాలు తీర్చడమే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. జగన్ నాయకత్వంలో మనందరి ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని అందరూ ఆర్థికాభివృద్ధి సాధించాలన్నదే సీఎం ఆకాంక్ష అని అన్నారు. అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, మండల పార్టీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, సర్పంచులు రెడ్డి చంటి, సాగి బంగార్రాజు, ఎంపీటీసీ సభ్యులు చావలి సుబ్బరాయశాస్త్రి, పేపకాయల బ్రహ్మానందం, షేక్ బడేమియా, గ్రామ పార్టీ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ, ఏఎంసీ డైరెక్టర్ సాకా జానకిరామరాజు, ఏఏబీ చైర్మన్ పెదపూడి శ్రీనివాస్, జిల్లా ఎస్టీ విభాగం అధ్యక్షుడు కుర్రా శ్రీను, పార్టీ మైనార్టీ విభాగం సభ్యుడు షేక్ కాజాబాబు పాల్గొన్నారు.

స్వస్థలానికి చేరుకోనున్న మృతదేహం

సఖినేటిపల్లి: ఉపాధి రీత్యా కత్తర్ దేశంలో ఉంటూ ఇటీవల గుండెపోటుకు లోనై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన సఖినేటిపల్లి రత్నాలపేటకు చెందిన నల్లి వెంకట్రావు మృతదేహం టీసీఎఫ్ చర్చి, ఏపీ ఎన్ఆర్టీస్ సహకారంతో మంగళవారం స్వగ్రామం చేరుకోనున్నది. వివరాలను రామేశ్వరానికి చెందిన కత్తర్ వైఎస్సార్ సీపీ కన్వీనర్ దొండపాటి శశికిరణ్ సోమవారం ఈ మెయిల్ ద్వారా వివరించారు. రత్నాలపేటకు చెందిన వెంకట్రావు 20 ఏళ్ల క్రితం కత్తర్ వచ్చారు. అక్కడ ఉపాధి పొందుతూ గుండెపోటుతో హమద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 15వ తేదీన మరణించారు. మృతుని బంధువుల ద్వారా విషయం తెలుసుకున్న టీసీఎఫ్ సంఘ పాస్టర్, బిషప్ ఓగూరి బుల్లబ్బాయి స్పందించి భౌతికకాయం ఇండియాకు పంపే ఏర్పాటు చేశారు.

మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల్లో విజేతలు

మామిడికుదురు: మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మూడు రోజులు జరిగిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు మంగళవారం ముగిశాయి. విజేతల వివరాలను మండల స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ మట్టా శ్రీధర్ తెలిపారు. అండర్–17 బాలుర కబడ్డీలో మామిడికుదురు, లూటుకుర్రు జట్లు విన్నర్, రన్నర్ స్థానాలు సాధించాయి. వాలీబాల్‌లో మామిడికుదురు, పెదపట్నంలంక ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించాయి. త్రోబాల్‌లో ఆదుర్రు, మామిడికుదురు స్కూల్స్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. షటిల్ బ్యాడ్మింటన్‌లో మొగలికుదురు, ఈదరాడ మొదటి, రెండవ స్థానాలు సాధించాయి. కోకోలో లూటుకుర్రు, మామిడికుదురు జట్లు ప్రతిభ కనబర్చాయి. టెన్నీకాయిట్‌లో ఆదుర్రు, మామిడికుదురు స్కూల్ ప్రతిభ చూపాయి. గరల్స్ విభాగంలో కబడ్డీలో మామిడికుదురు, ఆదుర్రు, కోకోలో మామిడికుదురు, ఈదరాడ, త్రోబాల్‌లో ఈదరాడ, మామిడికుదురు, వాలీబాల్‌లో మొగలికుదురు, ఈదరాడ, షటిల్ బ్యాడ్మింటన్‌లో ఈదరాడ, మొగలికుదురు జట్లు ప్రతిభ చూపాయన్నారు.

పోటీలు ప్రారంభం

పి.గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నియోజకవర్గ స్థాయి అండర్ 14, అండర్ 17 స్కూల్ గేమ్స్ మంగళవారం ప్రారంభమయ్యాయి. మొత్తం 8 విభాగాల్లో బాలురకు పోటీలు నిర్వహించారు. విజేతలను ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు పంపుతామని ఎంఈఓలు కోన హెలీనా, చింతా వీరభద్రం తెలిపారు. పోటీలను నగరం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నక్కా కృష్ణవేణి ప్రారంభించారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల కన్వీనర్ కొండేటి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు నక్కా వెంకటేశ్వరరావు, వాసంశెట్టి చినబాబు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.రమేష్, నియోజకవర్గ క్రీడా పోటీల సమన్వయ కర్త కేవీ రమణ, హెచ్ఎం డీఎస్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

సమతుల ఆహారంపై శ్రద్ధ

మలికిపురం: సమతుల ఆహారం తీసుకోవడం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని గుడిమెళ్ళంక మదర్ థెరిస్సా బీఎస్సీ నర్సింగ్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కడలి గిరి ప్రసాద్ పేర్కొన్నారు. కళాశాలలో మంగళవారం సమతుల ఆహారంపై జరిగిన సెమినార్‌లో ఆయన ప్రసంగించారు.

పకడ్బందీగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

అంబాజీపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పకడ్బందీగా ఇంటింటా సర్వే చేయాలని డీఎం అండ్‌హెచ్ఓ ఎం.దుర్గారావు దొర, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట ఆరోగ్య కేంద్ర పరిధిలో కొర్లపాటివారిపాలెం, గంగలకుర్రులో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటింటి సర్వేలో భాగంగా మొబైల్‌లో నమోదు చేసిన వివరాలను పరిశీలించారు. ఎంపీహెచ్ఈఓ రాయుడు రామకృష్ణ, హెచ్‌వీ ఎస్.శాంతకుమారి, పీహెచ్ఎన్ కె.రత్నకుమారి, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.మధుబాబు, ఎంపీహెచ్ఏలు ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మామిడికుదురు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షల నిర్వహణకు పెదపట్నంలంకలో శ్రీకారం చుట్టారు. నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి కేజే ప్రశాంత్‌కుమార్, ఏఎన్ఎం పి.నాగమణి పాల్గొన్నారు.

అయినవిల్లి: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు అన్ని విధాలా మేలు చేకూరుతుందని ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య అన్నారు. మంగళవారం తొత్తరమూడి–2 సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వలంటీర్ల ద్వారా జరిగే సర్వేను ఎంపీడీఓ వెంకటాచార్య పరిశీలించారు.

కొత్తపేట: ఈ నెల 30 నుంచి సచివాలయాల వారీగా జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ కార్యదర్శులు, వైద్య సిబ్బందితో ఎంపీపీ గంగాధరరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, సర్పంచులు నెల్లి లక్ష్మీపతిరావు, రెడ్డి చంటి, సాగి బంగార్రాజు, డీఎల్‌డీఓ ప్రభాకర్, ఎంపీడీఓ మహేశ్వరరావు పాల్గొన్నారు.

మోదీ జన్మదిన సేవా పక్షోత్సవాలు

మలికిపురం: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా పక్షోత్సవాలు మంగళవారం చింతలమోరి గ్రామంలో నిర్వహించారు. సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా బోర్డు మెంబర్ దొడ్డా నాగబాబు సమకూర్చిన దుస్తులను సుమారు 50 మంది మహిళలకు అందించారు.

భీమన్న రచనలతో ప్రజల్లో చైతన్యం

మామిడికుదురు: మహాకవి బోయి భీమన్న తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపారని రిటైర్డ్ ఎంఈఓ నీతిపూడి చంద్రబాబు పేర్కొన్నారు. భీమన్న 112వ జయంత్యుత్సవంలో భాగం మంగళవారం మామిడికుదురు బోయి భీమన్న మానవ వనరుల కేంద్రం ప్రాంగణంలో ఉన్న భీమన్న విగ్రహానికి పలువురు ప్రముఖులు, సహృదయ సాహితీ సంస్థ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూపతి వెంకటపతి, మంగం సత్యనారాయణ, వాసంశెట్టి శంకరరావు పాల్గొన్నారు.

పి.గన్నవరం: ప్రముఖ కవి బోయి భీమన్న జయంతిని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అంబేడ్కర్ సాహితీ సమితి అధ్యక్షుడు నేలపూడి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. భీమన్న చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఎంపీడీఓ ఎం.భారతి, మమత స్వచ్ఛంద సేవాసమితి అధ్యక్షుడు కోరుకొండ జాన్, నాయకులు అంబటి కోటేశ్వరరావు, జి.పాల్‌ప్రసాద్, పసలపూడి స్వర్ణలత, మంగం సత్యనారాయణ, మేకల రామకృష్ణ, బీవీ సత్యనారాయణ, పాలమూరి విక్రమ్, కడలి సత్యనారాయణ, ఆర్.రామకృష్ణ, వర్మ, మనోజ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.